# డాడాయిష్టిక్ బొమ్మ మారింది

## 1

అంత చిత్రకారుడా? ఇంతలో మారిపోయాడంటే ఎలా నమ్ముతాం? చాలా ఆశ్చర్యం కలిగింది. ఉన్నట్టుగా ఉండి డాడా యిష్టిక్ బొమ్మలు గీయడం ప్రారంభించాడు. అది అతని స్నేహితుల్లో ఏవో మార్పుని తెచ్చింది. అతన్ని ఒక వింత మనిషిగా చూడ్డం ప్రారంభించారు. కొందరు విసుపుతో అతన్నే డాడా యిష్టిక్ బొమ్మ అనేవారు.

"పాశ్చాత్య నాగరికతా ప్రభావం" అంది శాంత; అన్న నడవడిలో వచ్చిన మార్పులికి విసువుచెందిన శాంత. ఇంకా అంటోంది "అయినా మన దేశానికి అవసరమేముంది. ఫ్రాన్సులో వచ్చిన పరిస్థితులు వేరు. సర్రియలిజం, డాడాయిజం ఎప్పుడు జన్మించాయి అక్కడ. ప్రజలు ఒకమూల మాడుతున్నారు. తిండి తినడానికిలేదు. కట్టడానికి గుడ్డ లేదు. ఆ అవస్థల్లో డాడాయిజం, సర్రియలిజం పుట్టుకొచ్చాయి. ఇప్పుడు చూస్తే వాటికి అవి పుట్టినస్థానంలోనే దిక్కులేదు. మనవారు వాటిని ఎందుకు పిచ్చిగా అనుకరిస్తున్నారో తెలియదు. అన్న పరిస్థితేం పాలుపోడంలేదు."

సందర్భంలో అంతమార్పు రాడానికి అతని పరిసరప్రాంతాల్లో ఉండే భావకవి ప్రపంచమని తెలిసింది. వాళ్ళ దృక్పథాలు, భావాలు ఇతనిమీద ఇన్ఫ్లుయెన్సు చేసి పూర్తిగా మార్చేశాయ్.

"మరి, అర్నెల్లక్రితం వ్రాసినప్పుడు మార్క్సిస్టు పుస్తకాలు చదువుతున్నానన్నాడు!" అన్నాను మార్క్సిస్టు ఇలాగ ఎప్పుడూ మారడు అనే దృఢమైన నమ్మకంతో.

"ఆ! పుస్తకాలు చదివి మార్క్సిజం, నేర్చుకున్నవాళ్ళు ఎంతమందున్నారు. హేతువాద రీత్యా ఆలోచించి చూసుకుంటే తన నడతని ఇలాంటి మార్గాలు ఎప్పుడు పట్టించేవాడు కాదు అన్నయ్య."

అతను మార్క్సిస్టు పదాలు వాడుతూ వ్రాసిన లేఖలన్నీ గుర్తుకువచ్చాయి! 'ఈ రోజుల్లో అందరికీ మార్క్సిస్టు డనిపించుకోవడం ఫాషనవుతోంది' అని అరునబోస్ చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి.

## 2

మధ్యాహ్నం రెండింటికి సుదర్శనం వచ్చాడు. ఎంత వికృతంగా ఉన్నాడు! తన నడతలో ఉన్న వికృతాల్ని అతడు గుర్తించి ఉన్నాడన్న సంగతి, నన్ను చూడగానే అతను తడబడ్డంవల్ల తెలుసుకున్నాను – కాని ఆ జీవితం ఎవరో అలవాటుచేసి నమ్మించకపోతే అంతగా మారడు.

భోజనాలయనాక మాట్లాడుకున్నాం.

"మరి, మార్క్సిస్టునని వ్రాస్తున్నావుగా?"

"అవును, ఈ పరిస్థితుల్ని నేను కల్పించుకో గలుగుతున్నాను. మార్క్సిజం చెప్పే సిద్ధాంతం ఏమిటి? మన పరిస్థితుల్ని మనం కల్పించుకోవచ్చునని!"

"బాగానే ఉంది! అదా నువ్వు అర్థం చేసుకున్నది మార్క్సిజం గురించి? హేతువాదం, భౌతికవాదం, అన్నీ వదిలెయ్య. అంతకంతకి భావవాదంలోకి దిగజారడమే కాకుండా, ఐడియలిజంకు ఓ విధంగా దాసుడవుతున్నావు?"

పుస్తకాలనిబట్టి ఎవ్వరూ మార్క్సిస్టు కాలేరనీ కల్సి ప్రజలతో పనిచేయడంద్వారా ఎవరన్నా మార్క్సిస్టు కాగలరనీ, అందుచేతే మహిళా సంఘాల్లో పనిచేయడం, వీటిద్వారానే నీ చెల్లెలకు కలిగిన నమ్మకం మార్క్సిస్టు సిద్ధాంతంమీద నీకులేదనీ చెప్పి చెప్పి నమ్మించలేకపోయాను. ఇంక ఒకటేమార్గం కనపడింది. అతన్ని ఏదోవిధాన రంగంల్లోకి లాగాలి. అతని చిత్రకళను వృధాపోనీయకూడదు. పిచ్చి డాడా యిష్టిక్ బొమ్మలు గీయడంతో ఏమీకాదు. అలా ప్రజలతో సంబంధంలేకండా సర్రియలిస్టిక్... లైఫు గడుపుదామంటే కుదరదు. దీనికి నేనూ, శాంతా మార్గాలన్వేషిస్తున్నాం. వాదనలతో లొంగేమనిషి కాడతను.

## 3

ఉత్తర విశాఖజిల్లాలో కరువు ప్రాంతాల్లో సంచారంచేసి కరువు నిజపరిస్థితుల్ని తెల్సుకు రాడానికి రైతుసంఘం కృషికి విద్యార్థి సంఘంకూడ తోడ్పడి నిజమైన స్టేటస్టిక్సు తీసుకురాడానికి ప్రయత్నిస్తున్నారు. ఎలాగయితేనేం మొత్తంమీద, నేనూ శాంతా కల్సి సుదర్శనాన్ని వాళ్ళతో ప్రయాణం కట్టించాం.

బెంగాలు క్షామబాధితులను చిత్రించిన చిత్తా ప్రసాద్ చిత్రాలు కొన్ని ఇతన్ని కదిల్చాయి. అక్కడ బౌబజారు రోడ్డుమీద గుమిగూడిన క్షుధార్తుల చిత్రం బాగా మనసుని కలచివేసింది. కుంచెలు, సామానుపుచ్చుకుని బయలుదేరాడు.

నేను శాంతతో చెప్పి సెలవలకు ఇంటికి వెళ్ళిపోయాను – రైతుసంఘం క్షామపరిస్థితుల్ని గురించిన రిపోర్టు సవిస్తరంగా ఇచ్చింది. దాన్ని విన్నమీదట దేశంలో కావల్సినంత అలజడి వచ్చింది. దేశమంతా ఉత్తర విశాఖజిల్లా కరువునివారణకై ధనాన్ని వసూలుచేశారు. విశాఖ పట్టణంలో రిలీఫ్ఫుకమిటీ ఏర్పరచారు, అన్ని పార్టీలనూ రిప్రజెంటు చేసన్తాను వైద్యసహాయంకూడా వెళ్ళింది.

నేను సెలవలనించి తిరిగి వచ్చేశాను. సుదర్శనం తను వ్రాసిన బొమ్మలకు ఫినిషింగ్ టచస్ ఇస్తున్నాడు. అతను చెప్పిన విషయాల్నిబట్టి, ఆహార సమస్యకంటె అంటురోగాలు ఎక్కువ ప్రబలంగా ఉన్నాయి, అని తెలిసింది. ఆంధ్రదేశంలో ఈ పని తన భుజాలమీద పడడంవల్ల ఎంతో ధన్యుడనయ్యాననీ, ప్రజలకు చేయగలిగినసేవ తన కళ్ళ ద్వారా చేస్తూంటాననీ వాగ్దానం చేశాడు సుదర్శనం.

అంతలోకి శాంత "డాడా యిస్టిక్ బొమ్మ మారింది కదూ?" అంటూ నవ్వుతూ వచ్చింది! సుదర్శనం కోపంగా చూస్తున్నాడు.

*04. 02. 1945–ఆనందవాణి వారపత్రిక*